

బిఎల్‌ఒలకు ముగిసిన శిక్షణ



అర్హతపత్రాలు అందుకున్న బిఎల్‌ఒలతో తహశీల్దార్

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బూత్ లెవెల్ అధికారుల శిక్షణ శనివారంతో ముగిసినట్లు సహాయ ఓటర్ నమోదు అధికారి, తహశీల్దార్ జి.శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మం డలంలో 166 నుంచి 210 వరకు ఉన్న అన్ని పోలింగ్ స్టేషన్ల బిఎల్‌ఒలకు రెండు రోజులపాటు శిక్షణ నిర్వహించామన్నారు. అనంతరం వారికి అర్హత పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల డిటి పిఎ.మెహర్ బాబా, డిటి జానకి రామయ్య, వై.శ్రీనివాస్, వి.దేవేంద్రకుమార్, నాగం నాగ శివ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరికి వరద ఉధృతి

భద్రాచలంలో నిలకడగా గోదావరి

ప్రజాశక్తి -కొవ్వూరు, రాజోలు

గోదావరిలో వరద ఉరకలెత్తుతోంది. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో గోదావరిలో వరద ఉధతి అధికమయ్యింది. శనివారం రాత్రి 7 గంటలకు ధవళేశ్వరం ఆనకట్ట వద్ద నీటిమట్టం 10.70 అడుగులకు చేరింది. వరద ఉధృతితో జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో స్నాన ఘట్టాలు పూర్తిగా నీట మునగడంతో ప్రజలను నదిలోకి వెళ్లకుండా రెవెన్యూ, పోలీస్ అధికారులు నియంత్రిస్తున్నారు. సోమవారం సాయంత్రానికి వరద తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని అధికారుల అంచనా వేస్తున్నారు.

గోదావరిలో ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటిని దృష్టిలో ఉంచుకుని ఆదివారం ఉదయానికి ధవళేశ్వరం ఆనకట్ట వద్ద వరద ఉధతి అధికమవుతుందని అధికారులు అంచనా వేశారు. 9 లక్షల నుంచి 10 లక్షల క్యూసెక్కుల వరకు వరద నీరు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద పది లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరితే మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేస్తారు.

భద్రాచలంలో నిలకడగా వరద ఉధతి

భద్రాచలం వద్ద శనివారం మధ్యాహ్నం 12 గంటలకు 41.30 అడుగులకు చేరిన నీటిమట్టం రాత్రి 7 గంటల వరకు నిలకడగా కొనసాగింది. దాదాపు 7 గంటల పాటు వరద నిలకడగా కొనసాగడంతో 18 గంటల అనంతరం ఆ ప్రభావం దిగువన ధవలేశ్వరం ఆనకట్ట వద్ద కనిపిస్తుంది. ఆదివారం దిగువన జిల్లా పరిధిలో వరద ఉధతి అధికంగా ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు.

ఇసుక తవ్వకాలకు ఆటంకం

గోదావరి వరద ఉధతి కారణంగా జిల్లావ్యాప్తంగా ఇసుక తవ్వకాలకు ఆటంకం ఏర్పడింది. నదిలో ఉధతి అధికంగా ఉండడంతో తవ్వకాలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఔరంగాబాద్, ఎరినమ్మ ర్యాంపులు నీట మునిగాయి. వాడపల్లిలోనూ లోతట్టు ప్రాంతంలో వరద నీరు చేరడంతో తవ్వకాలకు బ్రేక్ పడింది. ప్రస్తుతం వాడపల్లి, ఔరంగాబాద్‌లో మాత్రం కొన్ని పడవల నడుస్తున్నాయి. ఆదివారం వరద తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున అవి కూడా నిలిచిపోయే అవకాశం ఉందని బోట్స్‌మెన్ సొసైటీ నిర్వాహకులు చెబుతున్నారు.

రాజోలు కోనసీమ లంక గ్రామాల ప్రజలు పడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. గౌతమి గోదావరికి వరద ప్రవాహం పెరగడంతో ముక్తేశ్వరం కోటిపల్లి మధ్య మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో పంటు ప్రయాణాన్ని నిలిపివేశారు. పి.గన్నవరం మండలం గంటి పెదపూడి వద్ద గోదావరి మధ్యలో ఉన్న ఊడిమూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజలు పడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. వరద ఉద్ధతి మరింత పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.



రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి

కేంద్రీయ విద్యాలయ భూసేకరణకు నిధులు

ఎంపీ హరీష్ వెల్లడి

ప్రజాశక్తి - అమలాపురం

అల్లవరం మండలం ఓడలరేవు గ్రామంలో కేంద్రీయ విద్యాలయ నిర్మాణం కోసం 7.50 ఎకరాల భూసేకరణకు 3.30 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ తెలిపారు. ఎన్నో ఏళ్లుగా కోనసీమ వాసులు ఎదురుచూస్తున్న కేంద్రీయ విద్యాలయ కల సాకారం చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు హరీష్ ధన్యవాదాలు తెలియజేశారు. మన ప్రాంతంలోని మత్స్యకార కుటుంబాలు, వ్యవసాయ కార్మికులు, ఒఎన్‌జిసి తదితర రంగాలలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు స్థానికంగా ఉన్నతమైన సిబిఎస్‌సి విద్యను అందించే అవకాశం కల్పిస్తుందని హరీష్ అన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి సహకరించిన సిఎం ఎన్. నారా చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పిల్లల భవిష్యత్తు కోసం ఒడలరేవు గ్రామంలో కేంద్రీయ విద్యాలయాన్ని త్వరితగతిన ప్రారంభించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ తెలిపారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయ ఏర్పాటు ప్రకటనపై హర్షం

ఓడలరేవు ప్రాంతంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 7.5 ఎకరాలు భూసేకరణకై నిధులు విడుదలకు కృషిచేసిన ఎంపీ గంటి హరీష్‌కు ఎంఎల్‌సి కుడుపూడి సూర్య నారాయణ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం అమలాపురంలోని ఎంఎల్‌సి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం మాట్లాడుతూ సిబిఎస్‌సి సిలబస్ దేశంలోనే ప్రతిష్టాత్మకమైనదని అటువంటి శిక్షణను కోనసీమ జిల్లా వాసులు ఎస్‌సి, బిసి, అగ్రవర్ణ పేదలకు అందుబాటులోకి విద్య రావటం అభినంద నీయమని అన్నారు. సిబిఎస్‌సి సిలబస్ చదివిన విద్యార్థులు దేశంలోనే ఐఐటి, ఐఐఎం వంటి ఉత్తీర్ణులవుతారని అన్నారు. ఇప్పటివరకు హైదరాబాదులో ఉన్న కేంద్రీయ విశ్వవిద్యాలయం ద్వారా ఎంపికైన విద్యార్థులు ప్రపంచ స్థాయిలో సిఇఒలుగా పనిచేస్తున్నారన్నారు. సమావేశంలో మట్టపర్తి నాగేంద్ర,కుడిపూడి త్రినాధరావు,దండుమేను రూపేష్, ముంగర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల సాధనకు పోరాటం

ప్రజాశక్తి - ఆలమూరు

మహిళా హక్కుల సాధనకు అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షులు గండి పద్మ అన్నారు. ఆమె అధ్యక్షతన ఆలమూరు సమత కార్యాలయం నందు శనివారం ఎపి మహిళా సమాఖ్య ప్రథమ మహాసభలు నిర్వహించారు. ముందుగా సమతా కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విమల, దుర్గాభవాని మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలలో భాగంగా మహిళలకు ఉచిత బస్ ప్రయాణం ఆగస్టు 15న అమలు చేస్తామని చేసిన హామీలో ఉచిత ప్రయాణం ప్రకటనను స్పష్టం చేస్తూ ప్రకటన చేయాలన్నారు. అనంతరం మహిళా సమాఖ్య జిల్లా నూతన సమితి కార్యవర్గ సభ్యులుగా 15 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.వారిలో గౌరవ అధ్యక్షులుగా గండి పద్మ,జిల్లా అధ్యక్షులుగా బండారు సావిత్రి, ప్రధాన కార్యదర్శిగా పి.సూర్యప్రభ, ఉపాధ్యక్షులుగా పోతుల ఝాన్సీ, సహాయ కార్యదర్శులుగా ఎస్.శారదాదేవి, ఎస్.వరలక్ష్మి, శీలం గౌరీ పార్వతి, కోశాధికారిగా కె.పద్మ, ఆఫీస్ బేరర్లుగా కర్రి రోజా, కేత పద్మజ, బొంతు దుర్గ, కాగిత విలాసమ్మ, మందపల్లి సుశీల, రొట్ట రాణి, నీతిపూడి తులసి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్నికైన నూతన కమిటీ వ్యవసాయ ఆధారిత జిల్లాలో గ్యాస్ ఆధారిత పరిశ్రమలు తీసుకురావాలని, ఆక్వా ఫిష్ కల్చర్ రంగంలో పని చేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించి వారికి కార్మిక చట్టాలను అమలు చేయాలని, వాలంటీర్స్ నీ విధుల్లోకి తీసుకోవాలని, లేదా స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పించాలని, ప్రత్యామాయంగా నిరుద్యోగ భృతి అందించాలని తీర్మానించింది.



మహిళా సమాఖ్య జిల్లా నూతన కార్యవర్గం

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని వెలిచేరు గ్రామం ఎస్‌సి పేటలో రోడ్డు చెంతని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా చేతికందేలా ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ఎప్పుడు ఏం ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయాలంటే ఏడడుగుల ఎత్తు సిమెంటు దిమ్మ ఏర్పాటు చేయాలి. దీనిపై ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి. అయితే విద్యుత్ శాఖ అధికారులు కాలువ చెంతని సిమెంటు ఓర్లను పెట్టి దానిపై సిమెంటు బల్ల వేసి ట్రాన్స్‌ఫార్మర్లును ఏర్పాటు చేశారు. అవి కాస్త కాలువలోకి ఒరగడంతో పంట కాలవలో పడి ఎప్పుడు ఏం ప్రమాదం ముంచుకొస్తుందని బెంబేలెత్తిపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చెంతనే ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో క్యాంపులు కిందికి పడిపోయేలా వేలాడుతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా వారు పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు అంటున్నారు. ఇటీవల ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించకపోయి ట్రాన్స్ ఫార్మర్ మీద ఒక వాహన చోదకుడు పడిపోవడంతో అప్పుడు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకుని ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలని అక్కడ వాసులు కోరుకుంటున్నారు.



వెలిచేరు గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

మండపేట సొసైటీ అభివృద్ధికి కృషి

అధ్యక్షునిగా రామారావు ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - మండపేట.

మండపేట సొసైటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని మండపేట వల్లూరి అప్పారావు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన అధ్యక్షులు కుక్కల రామారావు అన్నారు . మండపేట గుమ్ములేరురోడ్ లోని సొసైటీ కార్యాలయం లో శనివారం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. అధ్యక్షులు గా సీనియర్ నాయకులు కుక్కల రామారావు ప్రమాణస్వీకారం చేశారు. సభ్యులు గా పైడి మళ్ళ డేవిడ్ రాజు, పడాల జన్నయ్య ప్రమాణ స్వీకారం చేశారు. పురపాలక మాజీ చైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు రామారావు మాట్లాడుతూ తనను నియమించిన రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పిల్లి గణేష్, కౌన్సిలర్‌లు చిట్టూరీ సతీష్, గ్రంధి శ్రీనివాస్, బొక్కా సరస్వతీ, మాలసాని సీతా మహాలక్ష్మి, కొవ్వాడ బేబీ ఆపన్నబాబు, కాసిన కాశీ విశ్వనాథ్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, గడి రాంబాబు, టిడిపి మాజీ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, టిడిపి , జనసేన నాయకులు తదితరుల పాల్గొన్నారు.



సొసైటీలో నూతన అధ్యక్షునికి సన్మానం

పేదలకు అండగా సిఎం సహాయ నిధి

ప్రజాశక్తి - రావులపాలెం

సిఎం సహాయ నిధినేడు కూటమి ప్రభుత్వ హయాంలో పేద ప్రజలకు అండగా నిలుస్తోందని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం కాపు కళ్యాణ మండపం వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని 55 మందికి సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.40,27,237 విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గత ఏడాది కాలంలో 306 మందికి సిఎం సహాయ నిధి ద్వారా లబ్ది చేకూరిందని చెప్పారు. కూటమి అధికారంలోకి రాగానే సిఎం చంద్రబాబు తిరిగి సిఎం సహాయ నిధినని పునరుద్ధరించి బాధితులకు అండగా నిలుస్తున్నారన్నారు. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎంఎల్ఎ సత్యానందరావు, లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గుత్తుల పట్టాభి రామారావు, కాసా విజయసాగర్, ముత్యాల బాబ్జి, మాసాబత్తుల ఆనందరావు, కొప్పిశెట్టి ప్రసాద్, మైగాపుల గురయ్య నాయుడు, పి.ఎస్.రాజు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేసిన ఎంఎల్ఎ సత్యానందరావు

ఆలయ అభివృద్ధి పనులకు రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

స్వయంభు పుణ్యక్షేత్రం ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామి వార్ల ఆలయ అభివృద్ధి పనులు చేసేందుకు శనివారం హైదరాబాద్‌కు చెందిన కొడుకుల నరసింహారావు శర్మ, శశిరేఖ దంపతులు రూ.50 వేలను ఆలయ ఇఒ అధికారి భాగవతుల వెంకటరమణమూర్తి అందజేశారు. వీరికి స్వామివారి దర్శన అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

చికిత్స కోసం రూ.50 వేల సాయం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని ఉచ్చిలి గ్రామానికి చెందిన కొల్లి అశోక్ ఇటీవల కాలంలో అనారోగ్యంతో బాధపడుతూ ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ముదునూరి వీరబాబు రాజు శనివారం చికిత్స నిమిత్త ం అశోక్‌కు రూ.50 వేల సాయం అందజేశారు. అలాగే మాదిగ పేటలో వివిధ అభివద్ధి పనుల నిమిత్తం రూ.50 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కూసం పూడి రామకృష్ణంరాజు, జుజ్జవరపు హరిబాబు గ్రామటిడిపి అధ్యక్షుడు ముదునూరి నరేంద్ర రాజు పాల్గొన్నారు.

నేడు ఉచిత 'బిఎండి' క్యాంప్

ప్రజాశక్తి- కొత్తపేట

స్థానిక సందీప్ ఐ క్లినిక్ ప్రాథమిక కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి యూనివర్సల్ ఆసుపత్రి రాజమహేంద్రవరం వారిచే 'ఫ్రీ బిఎండి'(బోన్ మినరల్ డెన్సిటీ) క్యాంప్ నిర్వహిస్తున్నట్లు బండారు పెద వెర్రియ్య (చిట్టిబాబు) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు కొత్తపేట పరిసర ప్రాంత ప్రజలను తన వంతు సాయం అందిం చాలన్న ఉద్దేశంతో రూ.4 వేల విలువగల 'బోన్ మినరల్ డెన్సిటీ' పరీక్షలు ఉచితంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజేంద్ర బాబు ఆరుమిల్లి వారిచే నిర్వహిస్తారన్నారు. సందీప్ ఐ క్లినిక్ వారిచే కంటి పరీక్షలు నిర్వహించి అవసరాల వారికి ఉచితంగా ఆపరేషన్ చేయించి మందులు ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిట్టి బాబు కోరారు

పలువురికి జగ్గిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలం నార్కెడిమిల్లి గ్రామంలోని ఇటీవల గుండెకు సంబంధించిన వైద్యం చేయించుకున్న బైరిశెట్టి శ్రీనును మాజీ ఎంఎల్ఎ చిర్లా జగ్గిరెడ్డి శనివారం పరామర్శించారు. అలాగే పోతురెడ్డి నరసింహారావు, సాధనల సత్యం, పిట్టాసత్యవతి ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను మాజీ ఎంఎల్ఎ పరామర్శించారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ పాలా నాగేశ్వరావు, ఎంపిటిసి సభ్యులు పాల చిన్న వెంకటరమణ, మాజీ ఎంపిటిసి సభ్యుడు బాలం బాబురావు, ఉపసర్పంచ్ పోతురెడ్డి సురేష్, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కాలేరు పిఎసిఎస్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కాలేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం శనివారం అచ్యుతాపురం కార్యాలయం నందు ఘనంగా జరిగింది. సొసైటీ చైర్మన్ గా బోళ్ళ గోవిందరాజు, సభ్యులుగా దాసరి శ్రీనివాస్, కుడిపూడి శ్రీను ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ గోవిందరాజు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి, రైతు సమస్యల పరిష్కారానికి కషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, చుండ్రు రామకృష్ణ చౌదరి, చుండ్రు వెంకట్రావు, కాలేరు, వడ్లమూరు, అచ్యుతాపురం గ్రామాల రైతులు, సభ్యులు, కార్యకర్తలు, సొసైటీ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.



ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న గోవిందరాజు, సభ్యులు

వైసిపి జిల్లా కార్యదర్శి రామకృష్ణకు సత్కారం

ప్రజాశక్తి - అమలాపురం

అల్లవరం మండలానికి చెందిన చింతా రామకృష్ణను డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసిపి కార్యదర్శిగా పార్టీ అధిష్టానం నియమించింది. జిల్లా కార్యదర్శిగా నియమితులైన రామకృష్ణను శనివారం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైసిపి నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణను దుశ్శాలువాకప్పి పూలమా లలతో ఘనంగా సత్కరించారు. పదవి ద్వారా పార్టీ బలోపేతానికి కృషిచేసి సంక్షేమ పాలన అందించిన వైఎస్.జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు కష్టపడి పని చేయాలని రమణారావు సూచించారు.



రామకృష్ణ ను సత్కరిస్తున్న రమణారావు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన

ప్రజాశక్తి - మండపేట

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రజల కోసం పనిచేసే కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని మండపేట పురపాలక సంఘం మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్ అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం మండపేట 19వ వార్డులో వర ప్రకాష్ ఇంటింటికీ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలో సంక్షేమ పథకాలను అమలు చేశారని, ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సిఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉంగరాల రాంబాబు, పట్టణ అధ్యక్షులు మచ్చ నాగు, కౌన్సిలర్ లు కాసిన కాశీ విశ్వనాథ్, కొవ్వాడ అప్పన బాబు,19వ వార్డ్ ప్రెసిడెంట్ నూనే వీర్రాజు చౌదరి, వల్లూరి వీర రాఘవ చౌదరి, వెంకట్రావు చౌదరి, రెడ్డి పుల్లాజీ చౌదరి తదితరులు, పాల్గొన్నారు.



కరపత్రాలు అందిస్తున్న శ్రీ వరప్రకాష్


40 శాతం వరినాట్లు పూర్తి

ప్రజాశక్తి - రామచంద్రపురం

తొలకరి వరి నాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 40 శాతం వరి నాట్లు పూర్తయినట్లు మండల వ్యవసాయ అధికారి మణిదీప్ తెలిపారు. మొదటి దశలో వచ్చే తెగుళ్లపట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.వ రి నారుమడి దశలో వరి కాండం తొలుచు పురుగు , ఆకు ముడత పురుగు వంటి పురుగులు ఆశిస్తాయి వాటి నివారణకు కార్బోఫ్యూరన్ 3 జి గుళికలు 1 సెంటు నారుమడికి 160 గ్రాములు లేదా మోనోక్రోటోపాస్ 1.6 మిలీ లేక క్లోరిపైరిపాస్ 2 మిల్లీలీటర్ నీటికి విత్తిన 10 రోజులకు లేదా 17 రోజులకు పిచికారీ చేయాలి. అదేవిధంగా నారుమడి దశలో జింక్ లోప నివారణ కి జింక్ సల్ఫేట్ ద్రావణం 2 గ్రాములె లీటర్ నీటిలో పిచికారీ చేయాలి. దీంతో జింకు లోపాన్ని నివారించవచ్చని ఆయన వివరించారు. ఈ నెలాఖరుకు వరి నాట్లు నూరు శాతం పూర్తయ్యే అవకాశం ఉందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. కె.గంగవరం మండలం రామచంద్రపురం మండలం లోను ప్రస్తుతం నాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు మండల వ్యవసాయ అధికారి తెలియజేశారు.



వరినాట్లు వేస్తున్న కూలీలు



బాలికల వసతి గృహాన్ని సందర్శించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - కొత్తపేట

ఫుడ్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని కొత్తపేట ఆర్‌డిఒ పి.శ్రీకర్, తహశీల్దార్ వై.రాంబాబు శనివారం సందర్శించారు. వసతి గృహం నందు విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో వసతి గృహం నందు గల మౌలిక సదుపాయాలు, భోజన నాణ్యత విషయమై ఆర్‌డిఒ చర్చించారు. అదే విధంగా సదరు వసతి గృహం నందు నివసిస్తున్న విద్యార్థినిలతో మాట్లాడి వీరికి ప్రభుత్వం వారు అందిస్తున్న భోజన సదుపాయాల నాణ్యత, ఇతర మౌలిక సౌకర్యాల విషయమై వారి నుండి అభిప్రాయం సేకరించారు. విద్యార్థులందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆర్‌ఐ రవిశంకర్ ఉన్నారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్‌డిఒ పి.శ్రీకర్

మునిపల్లి సర్పంచ్ రామచంద్రరావుకు సత్కారం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మునిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం సర్పంచ్ రామచంద్రరావును ఆయన ఇంటి వద్ద వైస్ ఎంపిపి సాదే శ్రీనివాసరావు వైసిపి కండువాను కప్పి అభినందించారు. గత 14 ఏళ్లుగా వైసిపికి రామచంద్రరావు సేవలందించడం హర్షణీయమని పార్టీ కార్యకర్తలు అభినందించారు. సర్పంచ్ రామచంద్రరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను ఎండగడుతూ వైసిపి బలోపేతానికి తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.



రామచంద్రరావును సత్కరిస్తున్న వైస్ ఎంపిపి శ్రీనివాసరావు

మందేశ్వర స్వామిని దర్శించుకున్న తెలంగాణ అదనపు డిజిపి

ప్రజాశక్తి - కొత్తపేట

మందపల్లిలో మందేశ్వర స్వామిని తెలంగాణా ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్/ అదనపు డిజిపి విశ్వనాథ్ చెన్నప్ప సజ్జనార్ ఐపిఎస్ సతీ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు శనివారం స్వామివారికి తైలాభిషేకములు ద్వారా రూ.1,73,820, అన్న ప్రసాదం విరాళాలుగా రూ.41,203 మొత్తం వెరసి రూ.2,15,023 ఆదాయం వచ్చినట్లు సహాయకమిషనర్, కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు. ఆలయానికి విచ్చేసిన యాత్రికుల అవసరార్థం అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు

నేరాలు ఘోరాలు



చోరీ వివరాలు వెల్లడిస్తున్న ఎస్ పి కృష్ణారావు

బంగారం చోరీ కేసులో నిందితుని అరెస్ట్

రూ.50 లక్షల విలువైన బంగారం స్వాధీనం

ప్రజాశక్తి - అమలాపురం

ఇంటిలో నమ్మకంగా ఉంటూ దాదాపు రూ.50 లక్షల విలువైన బంగారాన్ని దోచుకున్న ఇంటి దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంట్లో నమ్మకంగా పని చేస్తూ ఈ నేరానికి పాల్పడ్డాడు. వారం రోజుల్లోనే నిందితుడిని పట్టుకొన్న రామచంద్రపురం పోలీసులు నిందితుడిని వద్ద నుంచి బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఎస్పి కృష్ణారావు పాత్రికేయులకు శనివారం వివరించారు. రామచంద్రపురం జడ్పి స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న దొంతంశెట్టి శ్రీనివాస్ రామచంద్రపురం రామదుర్గ వీధి, శోభా హాస్పిటల్ వెనుక నివాసం ఉంటున్నాడన్నారు. ఈ నెల 3న శ్రీనివాస్ తన భార్య అనారోగ్యంతో బాధపడుతుండగా విశాఖపట్నం వెళ్లి 7న రామచంద్రపురానికి తిరిగి వచ్చారని ఎస్పి తెలిపారు. చోరీ విషయాన్ని శ్రీనివాస్ తెలుసుకున్నాడని అన్నారు. ఇంటి ప్రధాన ద్వారం స్క్రూడ్రైవర్‌తో తెరిచి, తలుపు హ్యాండిల్ తీసివేసి, లోపలికి నిందితుడు ప్రవేశించాడని ఎస్పి తెలిపారు. ఇంటిలో రూ.50 లక్షల బంగారు ఆభరణాలను దొంగిలించినట్లు శ్రీనివాస్ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌పి తెలిపారు. దర్యాప్తు చేయగా ఇంటిలో పని చేసే దేవగుప్తం వీరభద్రరావు పై అనుమానం వచ్చింది. అతని అదుపులోనికి తీసుకుని ప్రశ్నించగా చోరీ విషయం వెల్లడైంది. నిందితుడి వద్ద నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పి తెలిపారు. రామచంద్రపురం డిఎస్పి రఘువీర్ నేతృత్వంలో రామచంద్రపురం సిఐ వెంకటనారాయణ, క్రైమ్ సిఐ గజేంద్ర కుమార్, రామచంద్రపురం ఎస్ఐ నాగేశ్వరరావు, ఎఎస్ఐ బాలకష్ణ, హెడ్ కానిస్టేబుల్ వీరబాబు, కానిస్టేబుల్ సూరిబాబు తదితరులు ఈ నేరాన్ని చేధించారని ఎస్పి తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఎస్పి అభినందించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-రాజానగరం

కుటుంబంలో గొడవలతో భార్య పుట్టింటికి వెళ్ళడంతో మనస్తాపం చెంది భర్త ఉరేసుకున్న సంఘటన కొంతమూరులో శనివారం చోటు చేసుకుంది. రాజానగరం ఎస్ఐ ప్రియకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. డెంటల్ టెక్నీషియన్ గొర్ల గోవిందరావు (44)కు తాళ్లూరుకు చెందిన విజయతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలతో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భార్య కుమార్తెను తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన గోవిందరావు కొంతమూరులోని తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడుకి కుమారుడు కుమార్తె ఉన్నారు.



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

రఘుదేవపురంలో భారీ చోరీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రఘుదేవపురం రవీంద్ర కాలనీలో ఒక ఇంట్లో భారీ చోరీ చోటు చేసుకుంది. ఇంటి యజమానులు బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో ఇంట్లోకి చొరబడిన దొంగలు రూ.లక్షల నగదుతో పాటు బంగారం, వెండి వస్తువులను అపహరించారు. రవీంద్ర కాలనీకి చెందిన సురవరపు మణికంఠ తన తల్లి ఈశ్వరితో కలిసి ఉంటున్నారు. రెండు వారాల క్రితం నిడదవోలులో బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో శనివారం ఇంటికి తిరిగి వచ్చి చూడగా, ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండటం చూసి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొత్తం రూ.లక్షా తొంభై వేల నగదు, 4 కాసుల బంగారు బిస్కెట్లు, 30 తులాల వెండి పట్టీలు, 60 తులాల వెండి కుంకుమ భరణి, వెండి చెంబులు కూడా దొంగలించినట్టు గుర్తించారు. పోలీసులు క్లూస్ టీమును రప్పించి దర్యాప్తు చేస్తున్నారు

14 నుంచి ఎంపిపి, జడ్‌పిటిసిలకు శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మహిళా ఎంపిపిలు, జడ్‌పిటిసి సభ్యులకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో జూలై 14 నుంచి 16 వరకు నాయకత్వ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ కెఎన్‌వి. ప్రసాదరావు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ "మార్పు ద్వారా విజేతలు" పేరుతో గత నెల 23 నుంచి రాష్ట్రవ్యాప్తంగా బ్యాచ్‌ల వారీగా పలు జిల్లాల్లోని పంచాయతీ వనరుల కేంద్రాల్లో ఈ శిక్షణలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. శిక్షణలో పాలన నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, ప్రజా ప్రతినిధుల విధులు-బాధ్యతలు, భావవ్యక్తీకరణ వంటి అంశాలపై ప్రాథమికంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. స్థానిక శిక్షణ కేంద్రంలో వసతి, ఇతర అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయని, పాల్గొనబోయే 67 మంది మహిళా ఎంపిపిలు, జడ్‌పిటిసి సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పలు చోట్ల సుపరిపాలనలో తొలి అడుగు



కూర్మాపురంలో కరపత్రాలు అందిస్తున్న మండపేట ఎంఎల్ఎ జోగేశ్వరరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

టిడిపి ఆధ్వర్యంలో జిల్లాలో పలుచోట్ల సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. **రావులపాలెం:** ప్రజల సంక్షేమం, అభివద్ధే మొదటి ప్రాధాన్యతగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శనివారం రావులపాలెం మండలం ఊబలంకలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అమలుపరిచిన హామీలు, సంక్షేమం, అభివద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **మండపేట:** రాయవరం మండలం, చెల్లూరు, కురకాళ్ళపల్లి, కూర్మాపురం, వెంటూరు, గ్రామాల్లో శనివారం నిర్వహించిన సుపరిపాలనుుం తొలి అడుగు కార్యక్రమంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ఆయన పాల్గొన్నారు. కూర్మాపురం గ్రామంలో మాజీ ఎంఎల్‌సి వివివి.చౌదరితో కలసి పర్యటించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితర్లు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు పేర్కొన్నారు. మండలంలోని కొమానపల్లి గ్రామంలో శనివారం జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజాభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు కార్యక్రమంలో పొద్దుకు నారాయణ రావు, కుంచనపల్లి వెంకన్న బాబు, కుంచనపల్లి నారాయణ ,మారెళ్ల శ్రీనివాసరావు, మంగ శ్రీనివాసరావు, షేక్ సుభాన్, ఇళ్ల సత్తిబాబు, ముమ్మిడివరపు వరలక్ష్మి, మొల్లి చిన్న నాగరాజు, మట్ట ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కొమానపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి శ్రేణులు



ఊబలంకలో పాల్గొన్న కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

15న మందపల్లిలో బహిరంగ వేలం

ప్రజాశక్తి- కొత్తపేట

మందపల్లి శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి దేవస్థానంలో నిర్ణీత కాలానికి వివిధ సరుకులు సేవలు అందించేందుకు భూమి సేద్యం చేసుకునేందుకు 15న టెండర్, వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆలయ కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు శనివారం ఒక ప్రకటలో తెలిపారు. దేవస్థానంనకు ఈ ఏడాది జూలై 16వ తేదీ నుంచి 2026 జూలై 15వ తేదీ వరకు 12 నెలల కాలమునకు వివిధ రకముల సామగ్రి కొబ్బరికాయలు, నల్ల నువ్వుల నూనె, కిరాణా, పూజా సామగ్రి సెట్లు, నెయ్యి, పెరుగు, కూరగాయలు, ఫ్లవర్ డెకరేషన్ ప్రింటింగ్, టెంట్ హౌస్, ఎలక్ట్రికల్ డెకరేషన్, శానిటేషన్, జపం హెరీమ సామగ్రి, సెట్లు సర్వే కర్రలు సెక్యూరిటీ గార్డులు స్వీపర్లు సెర్వెంట్లు సప్లయ్ చేయుటకు టెండరు కమ్, ఈ టెండర్లు నిర్వహిస్తారన్నారు. దేవస్థానం నందు ఉన్న గానుగ మిల్లు నందు ఆడి యాత్రికులకు భక్తులకు నల్ల నువ్వుల నూనెను అమ్ముకొను లైసెన్స్ హక్కునకు టెండరు, బహిరంగ వేలంపాటలు నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంనకు కొత్తపేట అలాగే ఊబలంక గ్రామాలలో 8.76 ఎకరాల మెరక భూమికి ఈ ఏడాది నుంచి 3 సంవత్సరముల కాలపరిమితికి టెండర్ కమ్ వేలంపాటలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగలవారు పాటలలో పాల్గొనవలసిందిగా కోరుతున్నట్లు తెలిపారు. ఇతర వివరములకు దేవస్థానం కార్యాలయం పనివేళలలో సంప్రదించ వచ్చునన్నారు.



శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఆలమూరు ఎంఎంసి కార్యవర్గం

ఆలమూరు ఎంఎంసి అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బండారు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆ పార్టీ తరుపున మండలంలోని మడికి కి చెందిన కొత్తపల్లి వెంకటలక్ష్మిని కూటమి ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసిన విషయం విధితమే. దీంతో శనివారం ఆమె పార్టీ శ్రేణులతో కలిసి నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావు నివాసానికి వాడపాలెం వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఆమెతోపాటు జనసేన పార్టీ తరఫున ఎన్నికైన ఎంఎంసి డైరెక్టర్లు జొన్నాడకు చెందిన చింతలపూడి శ్రీనివాస్ కుమార్, చొప్పెల్ల కు చెందిన తోరాటి సత్య కిషోర్, కలవచర్లకు చెందిన గుత్తుల నాగేశ్వరరావు, మూలస్థానం అగ్రహారానికి చెందిన దండా శ్రీదేవి నేత శ్రీనివాస్ ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు సూరపురెడ్డి సత్య, జనసేన నేతలు కొత్తపల్లి నగేష్, సలాది జెపి, నాగిరెడ్డి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై పోక్సో కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

కాకినాడ రంగారాయ మెడికల్ కాలేజీలో పారా మెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితులను వెంటనే సస్పెండ్ చేసి, పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేయాలని .పిడిఎస్‌యూ, పివైఎల్ ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. పిడిఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, పివైఎల్ రాష్ట్ర నాయకుడు వి.భీమ శంకర్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, విద్యార్థినులు రక్షణ లేని పరిస్థితుల్లో జీవిస్తున్నారని, పాఠశాలల నుంచి కళాశాలల వరకూ భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటన పై సమగ్ర దర్యాప్తు ప్రభుత్వం జరిపించి, నిందితులు పై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రక్షిత తాగునీరు వృథా

ప్రజాశక్తి - అంబాజీపేట



శివాలయంకు వెళ్లే దారిలో వృథాగా తాగునీరు

తాగునీరు అందక కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కుళాయిల నుంచి తాగునీరు వధా అవుతున్నా పాలకులు పట్టించుకోకపోవడంతో పాలకుల తీరుపై ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు.మాచవరం సెంటర్ శివాలయం కు వెళ్లే దారిలో ఒకే లైన్ పక్క పక్కన ఉన్న రెండు ట్యాప్ ల నుంచి తాగునీరు వృథాగా అవుతున్నా చర్యలు కానరావడం లేదని ప్రజల ఆరోపిస్తున్నారు. తాగునీరు వృథా కావడమే కాకుండా షాపుల ముందు నీరు నిలిచిపోతుంది. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుచున్నారు.

14న యథావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఈ నెల 14న కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు విధిగా ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని ఆదేశించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలం లోని సూరంపాలెం, యర్రంపాలెం గ్రామాల్లో పరిశుభ్రతను ప్రోత్సహించే జాతీయ మిషన్‌లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్శిటీ డిప్యూటీ ప్రొ ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొ ఎంబి.శ్రీని వాస్, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ డి.కిషోర్, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ ఐవి. వీరాంజనేయులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత, ప్రవర్తనా మార్పు ప్రాముఖ్యతను వివరించారు.

సత్యదేవుడిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి వారిని పలువురు ప్రముఖులు శనివారం దర్శించు కున్నారు. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారి రవివర్మ, రాష్ట్ర జిఎస్‌టి అధికారి హరేరామ్ కొండపైకి విచ్చేశారు. వీరికి దేవస్థానం అధికారులు ఆలయ లాంచనాలతో స్వాగతించారు. స్వామివారి దర్శనం అనంతరం వీరికి స్వామి తీర్థప్రసాదాలు, చిత్రపటాలు అందించారు.

పట్టణంలో విద్యుత్ కోతలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఎండ తీవ్రత, మరోపక్క అనధికార విద్యుత్ కోతలతో పట్టణంలో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఒకవేళ కరెంటు వచ్చిన లో వోల్టేజ్‌తో ఫ్యాన్లు తిరగక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు ఈ సమస్యను గుర్తించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు కుటుంబాలను దత్తత తీసుకున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎంపిడిఒ డి.శ్రీలలిత రెండు నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకున్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని వడ్లమూరు గ్రామానికి చెందిన మడికి బుల్లప్ప, గొంపా రాజు కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఆ కుటుంబాలను కలుసుకుని వారి అవసరాలను, సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తానన్నారు.

ముత్యాలమ్మకు వెండి చీర

ప్రజాశక్తి - తాళ్లరేవు

గ్రామదేవత ముత్యాలమ్మకు జొన్నలగడ్డ రామం కుమారుడు విశ్రాంత మిలిటరీ ఉద్యోగి సూర్యనారాయణ మూర్తి రూ.3 లక్షల విలువ చేసే వెండి చీర ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కొలను సత్తిబాబు, రామకృష్ణయ్య, ఆలయ కమిటీ సభ్యులు రచ్చ కామేశ్వరరావు, మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి సభ్యులు గంజా సూరిబాబు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆహార పదార్థాల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణానికి చెందిన మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి ద్వారా పట్టణ శివారల్లో నివసిస్తున్న నిరుపేదలకు, వలస కార్మికులకు శనివారం ఆహార పదార్థాలు, బిస్కెట్ ప్యాకెట్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ సహాయనిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్‌కుమార్ మాట్లాడుతూ తాళ్లూరి శ్రీకృష్ణమూర్తి జ్ఞాపకార్థం వారి కుమారుడు సత్తిరాజు ఆర్థిక సాయంతో ఆహార పదార్థాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. తమ సంస్థ ద్వారా, నిరుపేదలు, అన్నార్తులకు, బాలలకు, వృద్ధులకు సహాయ సహకారాలు అందజేస్తున్నామన్నారు.

సత్య దేవునికి వెండి ప్లేట్ బహూకరణ

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం సత్యదేవునికి దాత ఒకరు వెండి ప్లేటును బహు కరించారు. శనివారం హైదరాబాద్‌కి చెందిన కె.రఘు మోహన్‌గుప్త, శ్రీలేఖ దంపతులు సుమారు రూ.లక్ష విలువ చేసే వెండి ప్లేటును ఇఒ వీర్ల సుబ్బారావుకి అందజేశారు.

100 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తి గ్రామంలో శనివారం పద్మావతి ఐ కేర్ ఆసుపత్రి సహకారంతో మంగం జానుప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు వందమందికి కంటి పరీక్షలు నిర్వహించి 15 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వీరికిఉచితంగా తమ వైద్యశాలలో శస్త్రచికిత్సలు చేస్తామని పద్మావతి ఐ కేర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కె.రమేష్ తెలిపారు. **రౌతులపూడిలో:** మండలంలోని రాజవరం గ్రామంలో హైమా నేత్రాలయం ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్ళజోళ్లు, మందులు పంపిణీ చేపట్టారు. ఈ శిబిరాన్ని టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు లాలం కృష్ణవేణి, గ్రామ నాయకులు ప్రారంభించారు.

ప్రి పెయిడ్ స్మార్ట్ మీటర్ వద్దే వద్దు

ప్రజాశక్తి - కాకినాడ

తమ ఇళ్లకు అదాని ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్ బిగించడానికి వస్తే వద్దని చెప్పాలని సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలు పంచుతూ ప్రచారం ప్రారంభించారు. శనివారం నగరంలోని సుందరయ్య భవన్ పరిసరాలలో ఇంటింటికి ప్రచార కార్యక్రమాన్ని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వా శేషబాబ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల చట్టం చేసిందని తెలిపారు. ఆ చట్టానికి వైసిపి, టిడిపి రెండు పార్టీలు అనుకూలంగా ఓటు వేసాయన్నారు. దీని ఫలితంగా అదాని ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ప్రతి ఇంటికి ఏర్పాటు చేయాలని ఒప్పందం కుదిరిందన్నారు. గత ప్రభుత్వ సమయంలో టిడిపి నాయకులు స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టాలని పిలుపునిచ్చిన విషయం ప్రజలు మర్చిపోలేదన్నారు. కానీ అదే ఒప్పందం ప్రకారం స్మార్ట్ మీటర్లు బిగించడానికి కూటమి ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడం దారుణమన్నారు. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ స్మార్ట్ మీటరు బిగిస్తే ప్రజలు ముందుగానే సెల్‌ఫోన్ వలే రీఛార్జ్ చేయించుకోవాలన్నారు. మొబైల్ రీఛార్జ్ డబ్బులు అయిపోగానే మొబైల్ కనెక్షన్ ఆగిపోయినట్లు స్మార్ట్ మీటర్ వల్ల విద్యుత్ సౌకర్యం హఠాత్తుగా ఆగిపోతుందన్నారు. మీటర్‌కి అయ్యే ఖర్చు 9 సంవత్సరాల పాటు అద్దె రూపంలో వినియోగదారులపై భారం పడుతుందన్నారు. రాత్రి 6 గంటల నుంచి 10 గంటల మధ్యలో విద్యుత్ వినియోగిస్తే ఎక్కువ ధర చెల్లించేలా టైం ఆఫ్ ది డే అనే విధానం ఈ ఒప్పందంలో ఉందన్నారు. ఇప్పటికే కరెంటు బిల్లులో రకరకాల పేర్లతో భారీగా ఛార్జీలు వేస్తున్నారని తెలిపారు. కాకినాడ నగరంలో చెత్త పన్నుకు వ్యతిరేకంగా ప్రజలు మాట్లాడటం వల్ల, ప్రజా సంఘాలు, సిపిఎం సహా వామపక్షాలు చేసిన ఆందోళన ఫలితంగా చెత్త పన్ను రద్దు చేశారని గమనించాలన్నారు. అదాని ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఇంటికి బిగించడానికి వస్తే వద్దని చెప్పాలని నగర ప్రజలకు సిపిఎం విజ్ఞప్తి చేస్తుందన్నారు. కరెంటు బిల్లులో వివిధ రకాల పేర్లతో వేస్తున్న ఛార్జీలను వ్యతిరేకించాలన్నారు. కరెంట్ ఛార్జీలు చెల్లించడానికి చాలా ఇబ్బందులు పడుతున్నట్లు ఈ సందర్భంగా కొంతమంది ప్రజలు సిపిఎం బృందం వద్ద వాపోయారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటి సభ్యులు కె.నాగజ్యోతి, మలక వెంకటరమణ, చంద్రమళ్ళ పద్మ, మేడిశెట్టి వెంకటరమణ, టి.రాణి పాల్గొన్నారు.

కాగితపు సంచులతో కాలుష్యం నివారణ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాగితపు సంచులతో ప్లాస్టిక్ కాలుష్యం నివారణ సాధ్యపడుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ అన్నారు. శనివారం ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ కాగితపు సంచుల దినోత్సవం పురస్కరించుకుని అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల స్థానే కాగితపు సంచుల వినియోగంపై అవగాహన కల్పించేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా జూలై 12న కాగితపు సంచుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. గతంలో కిరాణా తదితర వస్తువులు కొనుగోలు చేస్తే కాగితపు సంచలలోనే కట్టి ఇచ్చేవారని అన్నారు. కానీ నేడు ప్లాస్టిక్ సంచులు సౌలభ్యంగా ఉండటం, తక్కువ ఖర్చుతో లభించడంతో వాటిని వినియోగిస్తున్నారని అన్నారు. ఈ సంచులు పర్యావరణానికి హాని చేస్తున్నాయని అన్నారు. పర్యావరణ ఆందోళనతో ఇప్పటికే పలు దేశాలు కాగితపు సంచుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని కాగిత సంచులను వినియోగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ఎస్.శ్రీనగేష్, బుద్ధరాజు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లు

ప్రజాశక్తి - కాకినాడ

రాపిడో యాప్‌తో ఆటో డ్రైవర్లు ఉపాధిని కోల్పోతున్నారని సిఐటియు నాయకులు అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ఆటో కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ట్రాన్స్‌పోర్ట్ రంగం జిల్లా కన్వీనర్ కె.సత్తిబాబు, సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడారు. రాపిడో యాప్ వల్ల ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, వారికి వచ్చే ఆదాయం మరింత తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యాప్ ను తక్షణమే ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక యాప్‌ను తీసుకువచ్చి ఆ యాప్ ద్వారా ఆటో రంగ కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. రవాణా రంగ కార్మికులకు ఉరితాడుగా ఉన్న మోటారు వాహన సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆ బోర్డు ద్వారా కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రవాణా రంగా కార్మికులు పనిచేయడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు ఆదాయం పన్నుల రూపంలో వస్తుందని తెలిపారు. దీని నుంచి కనీసం ఒక్క శాతం ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికుల శ్రేయస్సు కోసం ఖర్చు చేయాలని కోరారు. కాకినాడ అచ్చంపేట ఏరియాలో ఏర్పాటు చేసిన ఫిట్నెస్ చెకింగ్ అనేది రవాణా రంగ కార్మికులను ఇబ్బందులకు గురి చేసేలా ఉందని, దీనిని తక్షణమే అధికారులు పరిశీలన చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సతీష్, వేణుబాబు, నాగు, విజయ, పండు, బాలు, తదితరులు పాల్గొన్నారు.

వల్లభునికి రూ.3.73 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ రూపాల్లో రూ.3.73 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ కార్య నిర్వహణాధికారి వడ్డి సత్యనారాయణ తెలిపారు. వివిధ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.2,51,920, అన్నదాన విరాళాల ద్వారా రూ.85,129, కేశఖండన ద్వారా రూ. 6,320, తులాభారం ద్వారా రూ.400, లడ్డు ప్రసాదం ద్వారా రూ.30,135 వెరసి రూ.3,73,904 ఆదాయం సమకూరిందని తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహార ప్రసాదం, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు యాత్రికులకు సేవలందించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

వాహనాలపై వెళ్లే ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ వి.మౌనిక అన్నారు. శనివారం స్థానిక దర్గా సెంటర్ పరిసర ప్రాంతాలలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేకమంది హెల్మెట్లు లేకుండానే ప్రయాణాలు చేస్తున్నారన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారు,హెల్మెట్ లేని వారు, ర్యాష్ డ్రైవింగ్ వాహనదారులకు జరుమానాలు విధించారు.